క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: కడప నగరం శంకరాపురం పరిధిలో 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం ఉదయం 7 గంటల నుండి 8:30 వరకు కడప టౌన్ కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఉదయం 9 నుండి 10:30 వరకు చెన్నూరు, వల్లూరు మండలాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

21 నుంచి ఉజ్జీవ సువార్త స్వస్థత సభలు

కడప కల్చరల్ : కడప నగరం సీఎస్ఐ మైదానంలో ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేది వరకు ఉజ్జీవ సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, సభల కన్వీనర్ బ్రదర్ జోసఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని, ఈ సభలకు బెల్లంపల్లి ప్రాంతం నుండి అభిశక్తులైన దైవజనులు పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్ వస్తున్నారన్నారు. ఈ సభలు స్థానిక సంఘ కాపరులు, నాయకుల సహాయంతో జరుగుతాయన్నారు. ఈ సువార్త సభలకు కడప నగర ప్రజలందరూ హాజరై దేవుని దీవెనలు పొందాలని బ్రదర్ జోసఫ్ తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 78931 13238 ను సంప్రదించాలని ఆయన కోరారు.

చేతిరాతపై ఉచిత శిక్షణ

కడప కల్చరల్ : దస్తూరిని అందంగా రాయడంపై తాము ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని ఎస్ఎం స్కిల్ హబ్ నిర్వాహకులు మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 95028 90722 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు ఏఎఫ్‌యూలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'

కడప ఎడ్యుకేషన్: డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ జి. విశ్వనాథ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది హాజరుకావాలని తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా తదితరులు

కడప ఎడ్యుకేషన్: బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్తంగా పిల్లల్ని ప్రభుత్వ బడులలో చేర్పించడం కోసం జరుగుతున్న ప్రచారంలో భాగంగా శుక్రవారం కడప నగరంలో తారకరామానగర్‌లో బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్య ను అందించి మంచి మధ్యాహ్న భోజనం అందిస్తోందని, ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తారకరామ నగర్ ఎంపీపీ స్కూల్‌లో (13 మందిని) చేర్పించారు. ఉపాధ్యాయులు రామమూర్తి పాల్గొన్నారు.

పానకం పంపిణీ

కడప కార్పొరేషన్: శుభ శుక్రవారం (గుడ్‌ఫ్రైడే) సందర్భంగా రక్షణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాసాపేటలో పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు పి. సంపత్, చైతల్య , బి. ఓబయ్య, సారిక, సీహెచ్ వినోద్ కుమార్, కారుణ్య ప్రకాష్, రత్న కుమార్, రేవంత్, ధీరాజ్, పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

కడప కార్పొరేషన్: డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిసినట్లు జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 14వ తేదీ వరకూ వివిధ రకాల ఆటలపోటీలు, రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బి. ఓబయ్య, ట్రాన్స్‌జెండర్ సారిక, షేక్ షబ్బీర్‌లను సన్మానించారు.

ఏసుక్రీస్తు లోక రక్షకుడు

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు తన జీవితాన్ని త్యాగం చేసి మానవ లోకానికి రక్షకుడిగా మారాడని పలువురు క్రైస్తవ గురువులు పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పలు చర్చిల సంఘాలు, క్రైస్తవ కమిటీ సభ్యులు, గురువుల ఆధ్వర్యంలో శిలువయాగం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం ప్రతినిధులు నగరంలోని డాన్ బాస్కో ఐటీఐ వద్ద నుంచి చర్చి వరకు శిలువ మార్గం ఊరేగింపు నిర్వహించారు. ఆ క్షేత్రం సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్ ఆధ్వర్యంలో 14 స్థలాల శిలువ మార్గం ఊరేగింపు నిర్వహించారు. విశ్వాసుల మనసులు హత్తుకునేలా క్రీస్తు ప్రభువు చరిత్రను నాటి కల్వరి యాత్రలో పాల్గొన్న అనుభూతిని కలిగించేలా ఈయాత్ర సాగింది. అనంతరం క్రీస్తు ప్రభువు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. మానవుని జీవితంలో చివరి రోజులు, క్షణాలు ఎంతో విలువైనవని, క్రీస్తు ప్రభువు జీవితంలోకూడా చివరి మాటలు ఎంతో విలువైనవిగా మారాయన్నారు. తనను హింసిస్తున్న వారిని కూడా క్షమించమని తన తండ్రి అయిన దేవుడిని ప్రార్థించిన క్రీస్తు లోకానికి ఆదర్శంగా నిలిచారన్నారు. క్రీస్తు ప్రభువును శిలువలో బంధించి చిత్రవధ చేస్తున్నా ప్రభువు వారి పట్ల క్షమా గుణంతో వీరు ఏమి చేస్తున్నారో వారికే తెలియదు..వీరిని క్షమించండి అని దైవాన్ని ప్రార్థించిన ప్రేమ, దయగల కరుణామయుడని కొనియాడారు. మనను కాపాడేందుకు ఆయన దయగల మూర్తిగా ప్రాణాలు ఇచ్చేందుకైనా సిద్ధపడే మహనీయుడన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఎండీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపవాసకులకు శాంతి సేవా సొసైటీ మజ్జిగ, మంచినీరు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యమాత సుపీరియర్ మదర్ సరేన, యువత, కమిటీ పెద్దలు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను సైతం లెక్కచేయక..

క్రీస్తు ప్రభువు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పాపుల రక్షణ కోసం శిలువపై రక్తధారలు చిందించారని సీఎస్ఐ సెంట్రల్ చర్చి ఫాస్టర్ విక్టర్‌బాబు అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. ఆయనతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేస్ భాను మాట్లాడుతూ క్రీస్తు మానవుల పాపాలను తుడిచి పెట్టేందుకే మానవుడిగా ఈ లోకానికి వచ్చారని తెలిపారు. మానవతా వాదిగా ఆయన శిలువపై నుంచి చెప్పిన ఏడు మాటల అర్థాన్ని కూడా వివరించారు. భక్తులచే వాక్య పరిచర్య చేయించారు.

మరియాపురంలో ..

స్థానిక మరియాపురంలో గుడ్‌ఫ్రైడేని పురస్కరించుకుని భక్తులైన విశ్వాసులు మత గురువులు, స్థానిక క్రైస్తవ ప్రముఖులు శిలువ యాగం ర్యాలీ నిర్వహించారు. భక్తులు పోటీలుపడి శిలువను మోస్తుండగా, 14 చోట్ల ఆగి క్రీస్తు చివరి ఏడు మాటలను గుర్తు చేసుకున్నారు. మోస్ట్ రెవరెండ్ బిషప్ సగినాల పాల్ ప్రకాశ్ శిలువ మార్గం ఊరేగింపులో శిలువను మోస్తూ పాల్గొన్నారు. క్యాథడ్రల్ చర్చిలో ఆయన క్రీస్తు సందేశం అందజేశారు.

– న్యూ నేటివ్ కృపా ప్రార్థనా మందిరంలో దైవ జనులు మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ మహేష్ క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలు, ఆయన త్యాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రవితేజ, రోజా, శాంతిరాజు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

– స్థానిక స్పిన్నింగ్ మిల్లు వద్దగల ప్రకాశంపల్లెలో శిలువయాగం ఊరేగింపు నిర్వహించారు. క్రీస్తు శ్రమల పాటుల గురించి చర్చిలో రెవరెండ్ ఫాదర్ పెండ్లికట్ల బాల సుందరం వివరించారు. కార్యక్రమంలో ఆశానిలయం, క్రీస్తు జ్యోతి సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.



మహావీర్ సర్కిల్‌లో శిలువయాగం ర్యాలీలో పాల్గొన్న విశ్వాసులు



శిలువయాగంలో ఓ దృశ్యం



ఆరోగ్యమాత చర్చి వద్ద ప్రార్థనలకు వెళుతున్న విశ్వాసులు



ప్రకాశంపల్లెలో శిలువయాగం దృశ్యం



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు



మరియాపురం చర్చిలో మాట్లాడుతున్న బిషప్ సగినాల పాల్‌ప్రకాశ్

లాడ్జీలలో తనిఖీ



కడప నగరంలోని లాడ్జిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బంది లాడ్జీలను తనిఖీ చేశారు. లాడ్జీలలో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, లాడ్జీలలో బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జీలలోని రిజిస్టర్లను పరిశీలించారు. లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీల నిర్వాహకులు అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సి.సి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ పర్యవేక్షణలో ఎస్ఐ విద్యాసాగర్ సిబ్బందితో కలసి క్రాస్ రోడ్డులోని పలు అనుమానిత ప్రాంతాల్లో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా నేరాలను, అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడంలో భాగంగా రిజిస్ట్రేషన్‌లేని, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను తనిఖీ చేశారు. అలాగే అనుమానిత ప్రదేశాలను, లాడ్జీలను, హోటళ్లను, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. నేరాలను అదుపు చేయడంతో పాటు దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టింది. ఈ సంఘటనలో గంగాధర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. తొండూరు మండలం గంగాదేవిపల్లెకు చెందిన గంగాధర్‌రెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం పులివెందులకు వచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళుతుండగా పులివెందుల నుంచి జమ్మలమడుగు వైపు వెళుతున్న ఆటో ఢీ కొంది. చికిత్స నిమిత్తం 108లో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పెట్రోల్ పట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : వేసవి కాలంలో పెట్రోల్ పట్టే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని పీవీసీ పైపుల ఫ్యాక్టరీ, కొర్రపాడు రోడ్డులోని టీవీ ఆర్ పెట్రోల్ బంకుల్లో పని చేసే సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో 10 ఏళ్లకు ఒకసారి విద్యుత్ వైరింగ్‌ను మార్చుకోవాలన్నారు. ప్రతి యేటా ఆథరైజ్డ్ ఎలక్ట్రీషియన్‌తో వైరింగ్‌ను చెక్ చేయించుకుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. విద్యుత్ స్విచ్ బోర్డుల వద్ద కాలే వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాల ఇంజిన్ ఆఫ్ చేసిన తర్వాతనే పెట్రోల్, డీజిల్ పట్టాలన్నారు. అలాగే పెట్రోల్ నింపే సమయంలో సెల్‌ఫోన్లను వాడకుండా చూడాలని తెలిపారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

ముక్తిరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



నంది వాహనంపై దర్శనమిస్తున్న ముక్తిరామలింగేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీ మాతకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామ లింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో శివనామ స్మరణల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా దారి వెంబడి భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన

సిద్దవటం: మండలంలోని బంగారుపేట గ్రామ సమీపంలో వెలసిన గంగాభవానీ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం లక్ష కుంకుమార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్య మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, స్వస్తి వాచనం, మాతృకపూజ, ఋత్విక్‌వరణం, రక్షాబంధనం, అష్టోత్తర కలశాభిషేకం అర్చన, మంగళ హారతి పూజలు జరిపారని తెలిపారు. సాయంత్రం లక్ష కుంకుమార్చన చేసి అమ్మవారి ప్రసాదాలు. మంగళ ప్రదమైన గాజులు, పసుపు, కుంకుమ అందజేశామన్నారు.

సమాజ హితానికి మేధావుల మార్గ నిర్దేశం అవసరం



శంకరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ తదితరులు

కడప ఎడ్యుకేషన్: సమాజ హితానికి మేధావుల మార్గ నిర్దేశం ఎంతో అవసరం అని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కడప ఎస్‌టీయూ భవన్‌లో నిర్వహించిన జేవీవీ జిల్లా కార్యదర్శి దివంగత పరుచూరు శంకరయ్య సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావులు ముందుగా మంచి మార్పును, మంచి ఆలోచనా విధానాన్ని తమ కుటుంబ సభ్యులు, మిత్రులు, తాము పనిచేసే సంస్థలు, తమ చుట్టూ ఉన్న వారిలో తేవాలన్నారు. ఆ తర్వాతే సమాజం గురించి ఆలోచించాలన్నారు. దురదృష్టవశాత్తు ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైందన్నారు. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే ప్రజల్లో అనేక అంశాలపై బేధాభిప్రాయాలు ఏర్పడి సమాజంలో అరాచక పరిస్థితులు ఏర్పడతాయన్నారు. దానికి అడ్డుకట్ట వేసి సమాజాన్ని సరైన దిశలో పురోగాభివృద్ధి దిశగా మేధావి వర్గం నడపాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజంలో చదువుకున్న వారు మాత్రమే మేధావులుకారని, సమాజం కోసం మంచి ఆలోచనలు చేసే నిరక్షరాస్యులు కూడా మేధావులేనన్నారు. జనవిజ్ఞాన వేదిక ఏపీ రాష్ట్ర సంఘం సభ్యులు కొర్ర సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రశ్నించడం అవసరం అన్నారు. సామాన్యులకు ఆ విధమైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యక్తులు గోపాల్‌దాస్, రమణారెడ్డి, గురుకుమార్, గురుప్రసాద్, వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఐ నాయకులు నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, మునెయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కంభం బాలగంగిరెడ్డి, మహబూబ్‌బాష, టివి రమ ణయ్య, జేవీవీ నాయకులు శంకర్, సనావుల్లాతోపాటు ఎస్టీయూ, జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

గోసుల సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూర్తినాయుడు

కడప ఎడ్యుకేషన్: పెన్షనర్ల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులుగా దివంగత గోసుల సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయం అని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూర్తినాయుడు కొనియాడారు. శనివారం కడప ప్రభుత్వ పెన్షనర్ల భవన్‌లో గోసుల సుబ్బారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు కార్యవర్గ సభ్యులు గోసుల సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోసుల సుబ్బారెడ్డి జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొని అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గోసుల సుబ్బారెడ్డి పెన్షనర్ల సంఘానికి సేవలందించారన్నారు. అనంతరం తెలంగాణ పెన్షనర్ల సంఘం నాయకులు కూడా సుబ్బారెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు రాముడు, నాగయ్య, గంగాధర్, నూనె నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వేములలో గాలివాన

వేముల : మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. విపరీతమైన ఈదురుగాలులు వీచడంతో పులివెందుల-కడప ప్రధాన రహదారిలోని వి.కొత్తపల్లె వద్ద రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. అలాగే వేల్పుల సమీపంలో రోడ్డుకిరువైపులా చెట్లు విరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అల్ డిక్సన్ సంస్థలో అగ్ని ప్రమాదాలపై డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని జిల్లా అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగర శివార్లలోని కొప్పర్తి పారిశ్రామికవాడలోగల అల్ డిక్సన్ సంస్థ సిబ్బంది, సెక్యూరిటీ ప్రతినిధులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత డెమో నిర్వహించి అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే విధానంపై అవగాహన కల్పించారు. స్పందించాల్సిన తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సేఫ్టీ అధికారి కొండారెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రంలో..

పాత రిమ్స్ ప్రాంగణంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, ఆశా వర్కర్లకు అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది సూచనలు చేశారు. ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగితే వాటిని ఎదుర్కొనే విధానం, సురక్షితంగా బయటపడే విధానాన్ని తెలియజేశారు. అగ్ని ప్రమాదాలే కాకుండా ప్రకృతి విపత్తులు సంభవిస్తే తమ సహాయం కోసం వీలైనంత త్వరగా 101, 08562 242299, 9963737191 నెంబర్లకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి సారూ..

నగరంలో పలుచోట్ల విద్యుత్ దీపాలు లేకపోవడంతో నగర వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో ప్రజలు, ప్రయాణీకులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల నగరంలో చోరీలు కూడా ఎక్కువయ్యాయి. కమిషనర్ స్పందించి తక్షణమే ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – ఫొటోలు, సాక్షిఫొటోగ్రాఫర్, కడప



నబీకోట రామాలయం ప్రధాన రహదారిలో వీధి దీపాలు లేక చీకటిమయం



హాజి గఫూర్ సాహెబ్ స్ట్రీట్‌లో వీధి దీపాలు లేకపోవడంతో చీకటిగా ఉన్న ప్రాంతం